క్లుప్తంగా

లక్ష్యం.. స్థిరమైన అభివృద్ధి



పెనమలూరు: గ్రామ పంచాయతీలు స్థిరమైన అభివృద్ధి(ఎస్‌డీజీ) లక్ష్యంగా పని చేయాలని ప్రోగ్రాం ఏరియా కోఆర్డినేటర్ రాజేష్ అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 17 అంశాలతో కూడిన వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పౌష్టికాహారం, ఫీవర్ సర్వే ఇలా ప్రభుత్వం పేర్కొన్న 17 అంశాలు నమోదు చేసి ప్రణాళికలు సమగ్రంగా అమలు చేయటం వల్ల గ్రామ పంచాయతీ అభివృద్ధి లక్ష్యసాధనలో ఉంటాయన్నారు. కార్యక్రమంలోఎంపీడీఓ సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళ బ్యాంకు ఖాతాలో రూ. 10 వేలు మాయం

పెనమలూరు: మహిళ బ్యాంకు ఖాతాలో రూ. 10 వేలు మాయం అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన డాక్టర్ నజమున్నీసా గత నెలలో గుంటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వేలి ముద్ర వేసి, ఆధార్, పాన్‌కార్డు వివరాలు తెలిపింది. కాగా ఈ నెల 14వ తేదీన ఆమెకు మెయిల్ వచ్చింది. ఆమె యాక్సిస్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. ఆమెకు ఎటువంటి ఫోన్ రాలేదని, ఎవ్వరికి ఓటీపీ చెప్పలేదని అయినా తన బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేల మాయం అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వీరంకి వెంకట రమణ సూచించారు. మండలంలోని మంతెన గ్రామంలో డ్రోన్ ద్వారా భూముల రీ సర్వే ప్రక్రియను గురువారం ప్రారంభించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి వెంకటరమణ మాట్లాడుతూ పథకం ద్వారా భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1.28 లక్షలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.1.28 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కింపు గురువారం నిర్వహించారు. గత నాలుగు నెలలకు గానూ హుండీ ఆదాయం రూ.1,28,725 వచ్చినట్లు చెప్పారు. ఆలయ ధర్మకర్త తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ లెక్కింపులో పాల్గొన్నారు.

సాగుకు చేయూతలో ఏపీ ఆదర్శం

కంకిపాడు (పెనమలూరు): వ్యవసాయానికి చేయూత అందిస్తూ రైతులను నిష్ణాతులుగా తీర్చిదిద్దటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఆదర్శప్రాయమని రాజస్థాన్ వ్యవసాయశాఖ బృందం అభిప్రాయపడింది. కంకిపాడు మండలంలోని పునాదిపాడులో గురువారం పొలంబడి నిర్వహించారు. స్థానికంగా ఉన్న వరి క్షేత్రాలను ఐదుగురు సభ్యులతో కూడిన బృందం పరిశీలించింది. రాజస్థాన్ రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ కె.సి.మీన, వ్యవసాయశాఖ జేడీ పి.అజయ్ కుమార్‌తో పాటుగా ఏపీ రైతు భరోసా కేంద్రాల జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ డి.సుధారాణి తదితరులతో కూడిన బృందం పంట పొలాలను పరిశీలించింది. రాజస్థాన్ ప్రతినిధి బృందం మాట్లాడుతూ.. పొలంబడి నిర్వహణ ద్వారా రైతులను స్వయం నిష్ణాతులుగా సాగులో మెలకువలు పాటించేలా తర్ఫీదు ఇవ్వటం అభినందనీయమన్నారు. నాణ్యమైన పంట దిగుబడుల ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలను తమ రాష్ట్రంలోనూ చేపట్టేలా ప్రణాళిక చేపడతామని తెలిపారు.

ప్రకృతి సాగులో పంచాయతీ

పెనమలూరు గ్రామ పాలకుల వినూత్న ప్రయోగం

- ఖాళీ స్థలంలో సేంద్రియ వ్యవసాయం
- ఆకుకూరలు, కూరగాయల సాగు
- అక్కడ పండిన వాటిని అంగన్‌వాడీలకు ఉచితంగా సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: రసాయనిక ఎరువులతో ప్రజారోగ్యం పతనమవుతోంది. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగుకు డిమాండ్ పెరుగుతోంది. దీనిపై ప్రభుత్వం కూడా రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో పెనమలూరు పంచాయతీ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీ కామన్‌సైట్‌లో సేంద్రియ సాగు చేపట్టింది. పెనమలూరు గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త డంపింగ్‌యార్డు ఉంది. ఈ యార్డుకు పక్కనే దాదాపు 25 సెంట్ల కామన్ స్థలం కూడా ఉంది. ఖాళీగా ఉన్న స్థలాన్ని నిరుపయోగంగా ఉంచకుండా కూరగాయల సాగు చేయాలని పంచాయతీ పాలకులకు వినూత్న ఆలోచన వచ్చింది. దీంతో ఆ స్థలంలో సేంద్రియ ఆకు కూరలు, కూరగాయల సాగునకు శ్రీకారం చుట్టింది.



పెనమలూరు పంచాయతీ ఆధ్వర్యంలో సేంద్రియ విధానంలో సాగవుతున్న ఆకుకూరలు

ఆకుకూరలు, కూరగాయలు ప్రత్యేకం..

రసాయన ఎరువులతో పండుతున్న పంటలతో బేజారెత్తి పోతున్న పరిస్థితిలో పెనమలూరు పంచాయతీ సేంద్రియ సాగులోకి దిగింది. ఖాళీ స్థలంలో పాలకూర, తోటకూర, చుక్కకూర, కూరగాయాలు టమాటా, సొరకాయలు ఇలా పలు కూరగాయలు సాగు మొదలు పెట్టింది. కూరగాయల సాగుకు ఎటువంటి ఎరువులు వాడటం లేదు. ప్రకృతి సహజసిద్ధమైన ఎరువులు మాత్రమే వినియోగిస్తున్నారు. చెత్త డంపింగ్ యార్డు పక్కనే ఉన్న స్థలాన్ని నిరుపయోగంగా ఉంచకుండా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరల సాగు చేయటంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఈవో రాధాకృష్ణ

అంగన్‌వాడీలకు అండగా..

సేంద్రియ సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలు గ్రామంలో ఉన్న 8 అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. తుల్లులు, గర్భిణులు, చిన్నారులకు ఆకుకూరలు, కూరగాయలు పంపిణీ చేయటంతో వాటిని ఆహారంలో వినియోగిస్తున్నారు. సేంద్రియ ఆకుకూరలు తినటం వలన ఆరోగ్యానికి ఎంతో మంచిదనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలకు ఆకుకూరలు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా ఆకుకూరలు పంపిణీ చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేంద్రియ సాగు సక్సెస్ కావటంతో సాగు మరింత పెంచాలనే ఆలోచనలో గ్రామ పంచాయతీ ఉంది.

సేంద్రియ సాగు పై దృష్టి..

సేంద్రియ సాగు పై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి. రసాయన ఎరువులతో పండించిన పంటలు తినటం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కూరగాయలు సాగు చేయటం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

– లింగాల భాస్కరరావు, సర్పంచి, పెనమలూరు

సేంద్రియ సాగుతో ఆరోగ్యం..

సేంద్రియ కూరగాయల సాగుతో ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీగా ఉన్న స్థలంలో కూరగాయలు,ఆకుకూరలు సాగు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నాము. ప్రతి గ్రామ పంచాయతీలో ఇలా సాగు చేయటం వల్ల ప్రజల్లో చైతన్యం కలుగుతోంది.

– కపులూరు రాధాకృష్ణ, కార్యదర్శి, పెనమలూరు గ్రామ పంచాయతీ

అభివృద్ధిపై ప్రతిపక్షాల విషప్రచారం

ఉయ్యూరు: అభివృద్ధిపై ప్రతిపక్షాలు ఓర్వలేకే విష ప్రచారం చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్ ఎంఎ బేగ్, ఐదో వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేసి వినతి పత్రం అందించారు. ఎస్సీ కాలనీలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యప్రచారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ కాలనీలో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రజలకు అసౌకర్యంగా ఉంటే ఎస్‌టీపీ ప్లాంటును మరో ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తిచేశారు. ఐదో వార్డులో టీడీపీ ఉద్దేశపూర్వకంగా అసత్యప్రచారం చేసి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. చైర్మన్ నాని మాట్లాడుతూ ఐదో వార్డులో ఎనిమిది డ్రెయిన్లు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ప్రజలు రెండు డ్రెయిన్లకు అభ్యంతరాలు పెడుతున్నారని, ఆరు డ్రెయిన్లకు నిధులు కేటాయించామని తెలిపారు. మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని ఎవరికీ ఇబ్బంది లేని చోట ఏర్పాటుచేస్తామని తెలిపారు. మునిసిపాలిటీలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు.



మున్సిపల్‌చైర్మన్ వల్లభనేని సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

క్షయవ్యాధిపై అంగన్‌వాడీలకు అవగాహన

గన్నవరం: క్షయవ్యాధి పట్ల ప్రజలకు అవగాహనతో పాటు అప్రమత్తత అవసరమని రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి టి. మురళి తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నేషనల్ టీబీ నియంత్రణ, రే ఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మూడు వారాలకిపైగా తగ్గు, కఫం, జ్వరం, బరువు, ఆకలి తగ్గుట ఈ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని చెప్పారు. ఇటువంటి లక్షణాలు కలిగిన వ్యక్తులను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ, కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. సీడీపీవో పి. వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పలువురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మురళి

పసుపు రైతులకు బాసటగా సర్కారు

కంకిపాడు(పెనమలూరు): పసుపు రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని దావులూరు గ్రామంలో ఎండబెడుతున్న పసుపు కొమ్ములను వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయ్‌బాబుతో కలిసి గురువారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పంట దిగుబడులు, మార్కెట్‌లో ఉన్న ధర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా పసుపు కొమ్ములు రూ. 5వేలు ఉందని, కనీస మద్దతు ధర కూడా దక్కటం లేదని వాపోయారు. పెరిగిన పెట్టుబడి వ్యయానికి ప్రస్తుతం ఉన్న ధరకు పొంతన లేదని వివరించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ గత సీజన్‌లో కంకిపాడు కేంద్రంగా పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర రూ. 6,850 అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రస్తుత సమస్యను ఎమ్మెల్యే పార్థసారథి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందించి అన్ని విధాలా తోడ్పాటు అందించేలా కృషి చేస్తామని వివరించారు. చైర్మన్ చాట్ల విజయ్‌బాబు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. మార్కెట్‌లో ధర లేక నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సమస్య తలెత్తకుండా రైతులకు మంచి ధర అందేలా కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



దావులూరులో పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

కంకిపాడు: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని కోలవెన్ను సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కోలవెన్ను ఎంపీపీ పాఠశాలలో 135 మంది విద్యార్థులకు విజయవాడకు చెందిన కోనేరు భాగ్యలక్ష్మి వితరణతో రూ. 20 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, హెచ్‌ఎం శొంఠి మాధవరావు, ఉపాధ్యాయులు కె.అరుణకుమారి, బిట్రా జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి అందజేస్తున్న సర్పంచ్ సురేష్‌కుమార్ తదితరులు

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల అమలు

మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య

ఉయ్యూరు: రాష్ట్రంలో పేదలకు కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం కల్పించిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను సీఎం జగన్ అమలు చేయటం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ పాత్రికేయుడు పాటూరి రామయ్య అన్నారు. ఉయ్యూరులోని రోటరీ వృద్ధాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్యను ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేనితో పాటూరి రామయ్య సామాజిక అంశాలపై చర్చించి గత అనుభవాలను పంచుకున్నారు. పాటూరి రామయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి కన్న కలలు సీఎం జగన్ పాలనలో వాస్తవ రూపం దాల్చుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు సంక్షేమ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయటం సరికాదన్నారు. విధానపరమైన నిర్ణయాల్లో లోపాలు ఉంటే ఎత్తి చూపడమే నిజమైన ప్రతిపక్షం పని అన్నారు. వ్యవసాయ కార్మికోద్యమ సంక్షిప్త చరిత్ర, పాటూరి రామయ్య ఉద్యమం, జీవితం పుస్తకాలను ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్‌కు రామయ్య అందించారు.



పాటూరి రామయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

విద్యార్థికి ఎమ్మెల్యే రూ. 10 వేలు ఆర్థిక సాయం

గన్నవరం:పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి తెలిపారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం పేద విద్యార్థి లంకపల్లి త్రికాంత్‌కు వంశీమోహన్ అందజేసిన రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, వైఎస్సార్ సీపీ నేత మేచినేని బాబుతో కలిసి జెడ్పీటీసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని వేలాది మంది పేద కుటుంబాలకు చెందిన పిల్లల విద్యాభ్యున్నతికి ఎమ్మెల్యే ఆర్థిక తోడ్పాటునందించినట్లు చెప్పారు. ఈ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. పార్టీ మండల అధ్యక్షులు పడమట సురేష్, బుద్ధవరం ఉపసర్పంచి వేల్పూరి బసవరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈ-క్రాప్ నమోదు

కంకిపాడు: ఈ-క్రాప్ నమోదు పారదర్శకంగా సాగిందని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ అన్నారు. మండలంలోని గొడవర్రు రైతుభరోసా కేంద్రం వద్ద ఈ-క్రాప్ 2022-23 సీజన్ సామాజిక తనిఖీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ పరిధిలోని పంట భూముల విస్తీర్ణం, సాగైన పంటల వివరాలు, రైతుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రైతులు పలువురు దాళ్వా వరి పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ కాగిత శివన్నారాయణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష విరాళం



హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు రూ. లక్ష చెక్కు అందజేస్తున్న కేసీపీ సంస్థ యూనిట్ హెడ్ సీతారామదాసు

ఉయ్యూరు: వీఆర్‌కేఎం పాఠశాల అభివృద్ధికి కృషి చేసి విద్యా ప్రగతికి బాటలు వేస్తున్నామని కేసీపీ సంస్థ యూనిట్ హెడ్ వై.సీతారామదాసు అన్నారు. స్థానిక కేసీపీ, రోటరీ క్లబ్‌ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో వీఆర్‌కేఎం పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష విరాళాన్ని గురువారం పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు సీతారామదాసు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు సి.వెంకటేశ్వరరావు, సంపత్‌కుమార్, సయ్యద్ అనీస్, నాగసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గొల్లనపల్లిలో ఉపాధి పథకం గ్రామసభ

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ కార్యదర్శి మారుతీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో గడచిన సంవత్సరంలో గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షించారు. కూలీలకు అందించిన వేతనాలపై చర్చించారు. పనులు జరిగిన వివరాలను సభలో చదివి వినిపించారు. రైతుల ప్రయోజనం కోసం పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సచివాలయం సిబ్బంది, కార్యదర్శి శివనాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పునాదిపాడు సచివాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



ఉంగుటూరులో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

కంకిపాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం పునాదిపాడు సచివాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓ బొమ్మిడి వెంకటేశ్వరరావు, డి.మునిరాజు, ఎం.మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ పొట్టి శ్రీరాములు ఫొటోకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు స్వీట్లు, పులిహోరా పంపిణీ చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి వెంటప్రగడ వీరాంజనేయులు, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, మండల అధ్యక్షుడు రాచూరి ఆంజనేయులు,సభ్యులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

పోరంకిలో వాసవి క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా చేశారు. ఆయన ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేదలకు పండ్లు, వికలాంగులకు డైపర్స్ పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షుడు వెంకటమస్తాన్, ట్రెజరర్ శెట్టి శైలజ, సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా చేశారు. ఎంపీడీఓ సునితాశర్మ పొట్టి శ్రీరాములు ఫొటోకు పూలమాల వేశారు. ఏవో లోయ శివశంకరరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. కానూరు అశోక్ జిమ్‌లో మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి చేశారు. స్పెషల్ బ్రాంచి సీఐ హనీష్ పొట్టి శ్రీరాములు ఫొటోకు పూలమాలు వేశారు. పెదపులిపాకలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, కార్యదర్శి వి.పద్మావతి పాల్గొన్నారు.

ఘన నివాళి..

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ అనగాని రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఎంపీటీసీ సభ్యులు పడమట పాండురంగారావు, సూపరింటెండెంట్ ప్రసాద్, గృహ నిర్మాణ ఏఈ సాయి, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

ఉయ్యూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ నాని, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు జంపాన పూర్ణిమ, టీపీఓ బాలాజీ, అకౌంటెంట్ అరవిం పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్:ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి బాపులపాడు మండలంలో గురువారం నిర్వహించారు. ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాయలంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో ప్రభాకరరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాపులపాడు, వీరవల్లి, బండారుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా సర్పంచులు సరిపల్లి కమల భాయి, పిల్లా అనిత, వడ్లమూడి అమ్మాజీ పాల్గొన్నారు. ఏలూరురోడ్డులోని వాసవి కల్యాణమండపం ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ధన్యజీవి పొట్టి శ్రీరాములు

గన్నవరం రూరల్: త్యాగజీవి పొట్టి శ్రీరాములు అని పురుషోత్తపట్నం గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం కొనియాడారు. శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం గ్రంథాలయంలో పాఠకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి సమర్పించారు.

మహా పురుషుడు

ఉంగుటూరు: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమర జీవుడైన పొట్టి శ్రీరాములు మహా పురుషుడని ఎంపీపీ వడ్లమూడి సరోజిని కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి గురువారం నిర్వహించారు. ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.